## AP NEWS

# 2011లో మెరిసిన భారతీయం




జగతి సిగలో పారిజాతాలుగా వెలసిన వారు ఎందరో...రాజకీయ, సాహితీ సమరాంగణాల్లో ప్రజ్వలించిన విజయజ్యోతులుగా పేరు పొందిన వారు 2011లో ఎందరో ఉన్నారు. పరాయిగడ్డపై భారత జాతి కీర్తి బావుటా ఎగురవేస్తున్న ఎందరో మహానుభావులు 2011లో కూడా మెరిశారు.



### అరుణ మిల్లర్

రాజకీయాల్లో రాణిస్తున్న మరో తెలుగు తేజం అరుణమిల్లర్. 1972 అమెరికా వచ్చిన తల్లితండ్రులతోపాటు స్థిరపడిపోయిన అరుణ మిల్లర్ న్యూయార్క్‌లోనూ, తరువాత మేరీలాండ్‌లో స్థిరపడిపోయింది. ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన అరుణ క్రమేణ పాలిటిక్స్ వైపు మొగ్గుచూపింది. కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అందరి అభిమానాలను అందుకుంటూ చివరకు మేరీలాండ్ డిస్ట్రిక్ట్ 15 నుంచి డెలిగేట్‌గా ఎన్నికైంది. 2011లో మేరీలాండ్ గవర్నర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకునిరావడమే కాకుండా ఆంధ్రప్రదేశ్‌తో సిస్టర్ స్టేట్ అగ్రిమెంట్‌ను కుదర్చడంలో కీలకపాత్ర పోషించింది.

### బాబీ జిందాల్



బాబీజిందాల్‌కు అమెరికాలో అత్యంత ప్రజాదరణ ఉన్న నాయకునిగా మంచి గుర్తింపు ఉంది. దేశంలో మంచిపేరు ఉన్న రిపబ్లికన్ నాయకులలో జిందాల్ ఒకరు. తన పదవీకాలంలో లూసియానాను ఆయన ఉత్తమోత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దారు. అమెరికా అధ్యక్ష పదవికి ఆయన పేరు కూడా వినవచ్చిందంటే ఆయనకు ఉన్న ప్రజాభిమానమే అందుకు నిదర్శనం. 2011లో బాబీజిందాల్ మళ్ళీ లూసియానా గవర్నర్‌గా ఎన్నికయ్యారు.

### ఉపేంద్ర చివుకుల



నెల్లూరు జిల్లాకుచెందిన చివుకుల ఉపేంద్ర న్యూజెర్సి అసెంబ్లీకి 2002లో ఎన్నికయ్యారు. 17వ లెజిస్లేటివ్ డిస్ట్రిక్ట్‌కు డెమోక్రటిక్ పార్టీ తరపున ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2007 నుంచి అసెంబ్లీ డిప్యూటి స్పీకర్‌గా ఉన్నారు. తొలుత ఆయన అమెరికన్ పొలిటికల్ ఎడ్యుకేషన్ ఫోరంలో సభ్యుడై, ఫ్రాంక్లిన్ టౌన్‌షిప్‌కు డిప్యూటి మేయర్‌గా నేడు అసెంబ్లీమాన్‌గా ఉపేంద్ర చివుకుల పేరు తెచ్చుకున్నారు. ఇండియా నుంచి అమెరికా వెళ్ళి అక్కడి రాజకీయాల్లో 'తెలుగు వ్యక్తి'గా గుర్తింపును ఉపేంద్ర చివుకుల తెచ్చుకున్నారు. 2011లో జరిగిన ఎన్నికల్లో కూడా ఉపేంద్ర చివుకుల మరోసారి ఎన్నికై రికార్డు సృష్టించారు. తన ప్రత్యర్థి రిపబ్లికన్ అభ్యర్థి సలీంనాథూను ఆయన ఓడించారు.

### డాక్టర్ రావ్ ఇమంది



ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మెడికల్ గ్రాడ్యుయెట్స్ ఇన్ యుఎస్ఎ (ఎపిఎంజియుఎస్ఎ) సంస్థ చైర్మన్‌గా రావ్ ఇమంది వ్యవహరిస్తున్నారు. ఈ ఎపిఎంజి యుఎస్ఎలో రాష్ట్రంలోని వివిధ వైద్యకళాశాలల్లో మెడిసిన్ చదివిన విద్యార్థులు అమెరికా వెళ్ళి అక్కడ ఉన్నత చదువులు చదివి అక్కడే డాక్టర్లుగా స్థిరపడినవారు సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రానికి చెందిన పదివేల మంది ఇందులో సభ్యత్వం కలిగి ఉన్నారు. ఫిజిషియన్స్, డెంటిస్ట్స్, మెడికల్ సైంటిస్ట్స్ ఇందులో సభ్యులుగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు 34 మెడికల్, డెంటల్ కాలేజీలకు చదివిన విద్యార్థులు ఇందులో కనిపిస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో వైద్యవిద్య ప్రమాణాల మెరుగునకు, ఆస్పత్రుల్లో నాణ్యతా ప్రమాణాలు పెంపునకు ఈ అసోసియేషన్ సహాయ సహకారాలను అందజేస్తూనే మరోవైపు

### నిక్కీ హేలీ



దక్షిణ కరోలినా రాష్ట్రానికి తొలి మహిళా గవర్నర్‌గా భారత సంతతికి చెందిన నిక్కీ హేలీ ఎన్నికై చరిత్ర సృష్టించారు. హెలీ పూర్తి పేరు నమ్రతా నిక్కీ రాంధవా హెలీ. అమెరికాలో స్థిరపడిన సిక్కు దంపతుల కుమార్తె. ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా ఎన్నికైన ప్రవాస భారతీయుల్లో అమె రెండవవారు. బాబీ జిందాల్ తరువాత నిక్కీ హేలీ గవర్నర్‌గా ఎన్నికయ్యారు. 38 ఏళ్ళ హెలీ దక్షిణ కరోలినాకు తొలి శ్వేత జాతీయేతర గవర్నర్‌గా పేరు పొందారు. 2011 జనవరి 11వ తేదీన ఆమె గవర్నర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు.



### జయరాం కోమటి

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 17వ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించి తానా అధ్యక్షునిగా జయరాం కోమటి అందరి ప్రశంసలను అందుకున్నారు. కాలిఫోర్నియాలో పలు చోట్ల ఆంధ్రా రెస్టారెంట్లను ఏర్పాటు చేసి ఆంధ్రప్రదేశ్ రుచులను తన 'స్వాగత్' హెూటల్ ద్వారా అందరికీ అందజేస్తున్న జయరాంకోమటి ఆంధ్రప్రదేశ్‌లో కూడా పలు సహాయ కార్యక్రమాలను చేపట్టారు. అమెరికాలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ కష్టాల్లో ఉన్న తెలుగువారిని ఆదుకోవడంలో 'తానా' ముందుండేలా ఆయన కృషి చేశారు.

### సునీత కనుమూరి



భారతీయ వైద్యుల సంఘంగా పేరొందిన అమెరికన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియన్ ఆరిజన్ (ఎ.ఎ.పి.ఐ. 'ఆపి')కు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సునీత కనుమూరి అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. అధ్యక్షురాలిగా బాధ్యతలను చేపట్టిన తరువాత ఎన్నో కార్యక్రమాలను చేపట్టారు. 'ఆపి కనెక్ట్స్' అనే స్లోగన్‌తో సునీత కనుమూరి అపి సభ్యులందరితోనూ కలిసి చర్చిస్తూ సంఘం పటిష్టతకు కృషి చేస్తూ, మహిళల ఆరోగ్యరక్షణకు అధిక ప్రాధాన్యం కల్పించారు. ఆపిలో తొలిసారిగా ఉమెన్స్ హెల్త్ అడ్వయిజరీ బోర్డును ఏర్పాటు చేసి మహిళల జీవన విధానంలో మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తున్నారు. హైదరాబాద్‌లో తొలిసారిగా ఆపి సదస్సును ఆమె ఏర్పాటు చేశారు.



### షెఫాలి రజడాన్ దుగ్గల్

భారతీయ సంతతికి చెందిన మరో అధికార కేంద్రం షెఫాలి రజడాన్ దుగ్గల్. అమెరికా అధ్యక్ష పీఠాన్ని ఒబామా ఎక్కడానికి ఎన్ని మెట్లు ఉన్నాయో బయటి ప్రపంచానికి తెలియదు. కాలిఫోర్నియాలో ఆమె చెప్పిందే వేదం. అమెరికా రాజకీయాల్లో నిధుల సేకరణ బాహటంగా జరుగుతుంది. నిధుల ఖర్చు కూడా పారదర్శకంగానే ఉంటుంది. నిధులు సమకూర్చుకోవడంలో వారు తమ సత్తాను ప్రదర్శిస్తుంటారు. ఒబామాకు ఎన్నికల్లో ఆమె కీలకపాత్ర వహిస్తున్నారు.



### లక్కిరెడ్డి హనిమిరెడ్డి

కృష్ణా జిల్లాలో జన్మించిన లక్కిరెడ్డి హనిమిరెడ్డి వృత్తిరీత్యా కార్డియాలజిస్ట్‌గా అమెరికాలోని వాళ్ళకు బాగా తెలుసు. కాని ఎదుటివాళ్ళు కష్టాల్లో ఉంటే ధనాన్ని తృణపాయంగా ఇవ్వడంలో ఆయనకన్నా మించినవారు లేరు. ఇప్పటికే ఆయన ఎంతోమందికి సహాయం చేశారు. చేస్తున్నారు. 2011లో ఇంటర్నెట్ తెలుగు కాన్ఫరెన్స్‌లో తెలుగు భాషాభివృద్ధిలో భాగంగా రెండు తెలుగు ఫాంట్స్‌ను అభివృద్ధి చేయడానికి ఆయన విరాళమిచ్చి భాషాభిమానాన్ని చాటుకున్నాడు.